మరిచిపోలేని మేలు

ఓలేటి శ్రీనివాసరావు భాను

ఉదయం ఆరుగంటల నుంచీ ఎడతెరిపి లేకుండా ధారాపాతంగా కురుస్తున్న వర్షాన్ని తిట్టుకుంటూ, గంటన్నర నుంచీ గడియారాన్ని మార్చి మార్చి చూసుకుంటూ, గడిచిన పావు గంటలో పదిహేనోసారి వీధిలోనికి చూసివచ్చిన శర్మ మేస్టరు వంటింట్లోంచి భార్య అమ్మడు "టైమెంతయిందండీ" అని అడిగితే "ఒంటిగంటంపావు" అన్నాడు.

రివ్వు రివ్వుమని వీస్తున్న ఈదురు గాలి తెంపలు జెళ్ళుమనిపిస్తూ, గోడకి తగిలించిన తెలుగు కేలెండర్‌ని 'టప' టప' మనిపిస్తూంది. ఏ ఝామయ్యో వంటంతా పూర్తిచేసి కుంపటి దగ్గిర మడిగా కూర్చుని చలి కాగుతూ "శాస్త్రులు ఇహ వస్తాడంటారా ?" అని అడిగింది అమ్మడు

ఆ ప్రశ్నకి అంత చలగాలిలోనూ వళ్ళు భగ్గుమంది శర్మ మేస్టరికి!

"వస్తాడో, ఛస్తాడో నీ కెంత తెలిసి అఘోరించిందో నాకూ అంతే తెలిసి చచ్చింది. ఆరు మైళ్ళ దూరంనుండి పొలాల గట్లమీంచి బ్రాహ్మడు రావాలాయె ! ఉదయంనుంచీ చూడబోతే ఊళ్ళు ముంచుకొస్తున్నట్లు ముసురాయె!

నీ కేంపోయింది ఎన్ని కబుర్లేనా చెప్తావ్. ఎంత మహా తద్దినం వంట వండేసినా ముచ్చికాయ ముగ్గురికే కదా! మూడు ఘడీల్లో వంట వండేసి వంటింట్లో పొయ్యి దగ్గర కొక్కిరమ్మలా చలి కాచుకుంటూ శాస్త్రులు వస్తారా రాదా అని రెండు గంటల్నించీ ఒక్కలా వేపుకు తింటున్నావు" అని భార్యమీద కసురుకున్నాడు, శర్మ మేస్టరనబడే కాశీభట్ల కైలాసనాథ శర్మ, ది రిటైర్డ్ స్టేషన్ మాస్టర్!

"ఇది మరీ బావుంది! అడిగి తెలుసుకోవడం కూడా తప్పే కాబోలు. ఇంట్లో అసలే కార్యం జరిగినా మీకు అన్నింటికన్నా ముందు చిరాకు ముంచుకొస్తుంది," అని గొణుక్కుంది అమ్మడు.

"ఏమిటే ఆ గొణగడం? చిరాకు పడేనంటే పడనూ మరి. ముప్పావుగంట నుంచీ చూస్తున్నాను, ఇది ముప్పై మూడోసారి నువ్వడగడం నేను చెప్పడవూను" అని రెచ్చిపోయిన కోపంలో తమ కుటుంబం తప్ప "మరే బ్రాహ్మణ గడపే లేని ఆ దిక్కుమాలిన పల్లెటూళ్ళో, ఆరునెలల క్రిందట తను రిటైర్ అయిన తరువాత కొడుకులు ఎంత వద్దని చెబుతున్నా, చవగ్గా దొరుకుతున్నాయని భూములు కొనిపించిన బావమరిదినీ, అందుకు ప్రోదిచేసిన భార్యామణినీ, ఇరుమైళ్ళ దూరంనుంచి తన తండ్రిగారి ఆబ్దికం కోసం సరిగ్గా ఈ వేళ పన్నెండు గంటలకి భోక్తగా రావలసిన పొరుగూరి శాస్త్రుల్ని రానివ్వకుండా కురుస్తున్న వర్షాన్ని తిట్టుకుంటూ, మరో కాలంలో కాకుండా కేవలం వర్షాకాలంలోనే సంభవించిన తండ్రి మరణమ్మీదా చిరాకుపడ్డాడు.

ఆ మాటల్నే అమ్మడితో అంటే-

"ఇది మరీ బావుందండీ! మనం తద్దినాలు పెట్టుకోడానికి అందువిడిగా చావులు పొడి కాలాల్లోనే సంభవిస్తాయిటండీ? ఇవేవన్నా పెళ్ళిముహూర్తాలా మనిష్టం వచ్చినప్పుడు పెట్టుకోడానికి!" అని అవకాశం వచ్చింది కదాని మూతిని ఈ కొసనుండి ఆ కొసకు సాగదీస్తూ, జారిపోతున్న జానాబెత్తెడు పండు జుట్టునీ తిరిగి ముడి చుట్టుకుంటూ, ఇంకా ఏదో చెప్పబోతోంది అమ్మడు

"నోరు మూసుకో తల్లీ! పొరపాటున నోరు జారేను. నీ పెద్దలకి వెయ్యి దండాలుగానీ మన్నాకు చిరెత్తించకు. సందు దొరికితే చాలండీ షంటింగ్ ఇంజనులా తగులుకుని వర్రతిన్న కాకిలా ఒహాటే గోల" అని విసుక్కుంటున్న శర్మ మేస్టర్ "కావ్ కావ్" మని శబ్దం రావడంతో పెరటి వరండాలోకి తొంగి చూసేడు. చటికి బాగా వడబట్టిపోయి, తడితో బరువెక్కిన రెక్కల్ని 'టప టప' మని అల్లార్చుకుంటూ ఓ కుంటి కాకి ఒంటికాలితో బట్టలు ఆరవేసే దణ్ణెమ్మీద ఈ కొసనుంచి ఆ కొసకి

తిరుగుతూంది. ఉండుండి దణ్ణెమ్మీద అటూ ఇటూ ముక్కుని రాసుకుంటూ మేతకి ఏవీఁ దొరకనందున 'కావ్ కావ్' మంటున్నది.

"అమ్మయ్య" అనుకున్నాడు శర్మ మేస్టరు. అమ్మడిని మెల్లగా రమ్మంటూ సైగచేసి కాకిని చూపించేడు. ఎంతో సేపట్నించి ఎదురుచూస్తున్న బండి సైట్ అయినట్లనిపించింది వాళ్ళకి.

"ఎలగరా తండ్రీ ఈ దిక్కుమాలిన ముసురులో తర్పణాలు తినడానికి పిట్ట కాకైనా రాదేమోనని బెంగ పెట్టుకు ఛస్తుంటే, ఆ భగవంతుడు చల్లగా చూసి కుంటిదో గుడ్డిదో ఓ కాకినంటూ పంపించేడండి. కాకపోతే చోద్యంకాని ఇంత కుంభవృష్టిలోనూ ఇంట్లో ఈగైనా కదల్లేదే! ఎక్కణ్ణించి ఎగిరొచ్చిందో ఇది?" అంటూ కోరమాండల్ ఎక్స్ప్రెస్‌లా కొట్టుకుపోతున్న అమ్మడి వాక్ప్రవాహానికి 'చైన్' లాగి 'బ్రేకు' వేస్తూ,

"ఇహ నీ ధోరణి చాలుగానీ, ఇవాళ పూజంతా అయిపోయేవరకూ నువ్వా కాకిని ఎటూ ఉడాయించకుండా చూడాలి. అదెటేనా ఎగిరిపోయిందా మళ్ళీ చచ్చేచావు. చిన్న సులువు చెప్తాను విను. వెంటనే నాలుగు నూకల గింజలా వరండాలో మూల పడీ. అవి కొరుక్కుంటూ అదక్కడే తచ్చాడుతుంది. ఎందుకేనా మంచిది ముందు జాగ్రత్తగా సవంయం చూసుకుని ఆ పెరటివరండా జాఫిరీ తలుపులూ, మధ్య తలుపులూ మూసీ మరెటూ కదల్లేదది."

శర్మమేస్టరు చెప్పినట్లు తూ. చ. తప్పకుండా చేసి, "అమ్మయ్య" అని మధ్యగదిలో ఎడంగా కూర్చుంది అమ్మడు.

పాపం ముసురు మూలంగా ఉదయాన్నుంచీ ఎక్కడా మేత దొరికినట్లులేదు, కుంటి కాకి ఆత్రంగా నూకల్ని బుక్కేస్తూంది.

"ఇహ ఇసుంటా వచ్చీ! మరి మాటిమాటికీ రెక్కలు తీస్తూన్న దాన్నలా చూడకు" అని అంటూ ఎవరో వచ్చిన అలికిడి విని వీథిలోనికి చూసేడు శర్మ మేస్టరు

ఆ దంపతులిద్దరి కళ్ళూ ఆనందంతో మెరిసిపోయేయి. తమకోసం వెయ్యబడిన స్పెషల్ ట్రైను వాళ్ళ వాకిట్లో కొచ్చినంత సంబరపడ్డారు వాళ్ళు. ఎదురుగా శాస్త్రులు నిలబడ్డాడు. తాటాకుల గొడుగులో వచ్చినా తడిసి ముద్దైపోయేడు. పైమీద తువ్వాలు తప్ప చొక్కా లేదతనికి. కట్టుకున్న గావంచా గుడ్డ పూర్తిగా బురదనీటితో డాగులు కట్టుకుపోయింది. ఆరుమైళ్ళ దూరాన ఉన్న పల్లెటూరినుంచి దారి పొడుగునా నీటిగుంటలు దాటుకుంటూ పొలాల గట్లకి అడ్డంపడి రావడంవల్ల పాదాల



నిండా, కాలివేళ్ళ సందుల్లోనూ బంకమన్ను నిండిపోయింది.

"రా శాస్త్రులూ రా" అంటూ వృద్ధ దంపతులిద్దరూ ప్రేమతో ఆహ్వానించేరతన్ని. అమ్మడు అందించిన రెండు చెంబుల నీళ్ళతో వీధి గడపలో కాళ్ళ బురదని కడుక్కొని, గోనెపట్టామీద పాదాల తడిని గట్టిగా తుడుచుకుంటూ, వారంరోజులనుండీ విపరీతంగా ముంచుకొస్తున్న ఉబ్బసాన్ని భరించలేక 'ఖంగ్ ఖంగ్' మని దగ్గుతూ ఆయాసపడుతున్నాడు శాస్త్రులు.

గత మూడురోజులుగా ఇంటిల్లిపాదీ వస్తులు పడుండటంవల్ల, ఆరుమైళ్ళ దూరంనుంచీ తద్దినం భోజనంకోసం వాచిపోయిన ముఖంతో, తాంబూలంతో దొరికే నాలుగు పరకల దక్షిణ డబ్బుల కోసం కొండంత ఆశతో, మింటికీ మంటికీ ఏకధారగా కురుస్తున్న వర్షాన్నీ, నెట్టుకొస్తున్న నీరసాన్నీ లక్ష్యపెట్టకుండా నడచుకొచ్చేడు శాస్త్రులు.

"బాగా ఆలస్యమైపోయింది బాబూ! ట్రైను రెండౌతుందేవింటి? ఆ కాడికి తొందరగా బయల్దేరాలని పెందరాళే తెమిలేను. కానీ ఈ ముసురు చూసేరా ఎలా ముంచుకొచ్చిందో! ఏ గడికైనా తగ్గకపోతుందాని చూస్తుంటే అలా మరింత కొట్టుకురావడవేఁగానీ తగ్గుముఖం పడితేనా? నా గుబ్బగొడుగు కమాన్లు విరిగిపోయి, గుడ్డ కాస్త ఎంకొట్టేసి చిరిగి చిద్రూపవైఁపోయింది. మరో గొడుక్కోసం వేపగిస్తే అతి కష్టంమీద దొరికిందీ తాటాకు గొడుగు.

ఆ౯. ఇహ ఇ౦ట్లో అంతా సిద్ధమే౯ కదమ్మా" అని అడిగేడు శాస్త్రులు.

"అన్నీ సిద్ధమే౯" నని కుంపటిమీద మడిగా కాచి ఉంచిన వేణ్ణీళ్ళని ఇద్దరికీ తొర్లించింది అమ్మడు

పెరటి వరండాలో కుంటికాకి నూక లన్నీ తినేసి ఓ మూల రెక్కల్లో ముఖాన్ని ముడుచుకుని వెచ్చగా కునుకు తీస్తూంది.

శాస్త్రులు తను కట్టుకొచ్చిన గావంచా గుడ్డని తడిపేసి వరండాలో దణ్ణెమ్మీద ఆరేసి శర్మ మేస్టరిచ్చిన మడిపంచెని కట్టుకున్నాడు.

ఇద్దరూ మధ్యగదిలోకి మడిగా వచ్చేరు. అమ్మడు పూజకి కావలసిన ఏర్పాట్లు చేసింది. పూజ మొదలుపెట్టి దగ్గుతూ, ఆయాసపడుతూ మంత్రాలు చదివి అయిందనిపించేడు శాస్త్రులు.

ఓ విస్తరాకులో అన్నం పిడచల్ని పెరటి వరండాలోకి తీసుకొచ్చి తూర్పు దిక్కున ఉంచి నీళ్ళు వదిలేసేడు శర్మ మేస్టరుఖంగారుగా విస్తరిమీదకికలబడింది కుంటికాకి మరో కాకో, పిచికో వచ్చి కదెత్తుకు పోతాయేమోనని అటూ ఇటూ చూస్తూ అన్నం పిడచలు తినేసి "ఇంకొంచెం పెడితే బావుణ్ణ"న్నట్లు చూసిందది.

అందరి భోజనాలూ పూర్తయ్యేయి.

శాస్త్రులు కడుపు అబగా తిన్న గారెలతో బరువెక్కింది. దక్షిణ డబ్బులు మొలకి దోపుకుని తాంబూలం బిగించి వీధి వరండాలో భారంగా చేరబడ్డాడు.

సాయంత్రానికి వర్షం బాగా తగ్గింది. పెరట్లో దణ్ణెమ్మీద ఆరేసుకున్న గావం చాని మార్చుకుని తిరుగు ప్రయాణానికి సిద్ధమయ్యేడు శాస్త్రులు.

"వాన బాగా తెరిపిచ్చినట్టుంది. మేస్టారూ! ఇహ నేను వెళ్తాను. ఈ దగ్గొహటి చెడ్డ తినేస్తున్నాది. రేపు పార్వతీపురం ధర్మాస్పత్రికి వెళ్ళాలి. ఇవాళ మీ ఊరి షాహుకారు అడ్డెడు బియ్యం ఇస్తాను రమ్మన్నాడు. అతగాణ్ణి కలుసుకుని మళ్ళీ జల్లు రాకముందే మా ఊరు పోవాలి. మరి సెలవిప్పించండి వస్తానమ్మా" అని బయల్దేరబోయేడు.

"శాస్త్రులూ, ఏళ్ళూ ఊళ్ళూ ఏకమై౯ పోతున్న రోజు దేన్నీ లక్ష్యపెట్టకుండా భగవంతుడిలా నువ్వొరాబట్టి సమయానికి మా నాన్నగారి ఆబ్దీకం సవ్యంగా జరిగి పోయింది. లేకపోతే ఎన్ని అవస్తలు పడవలసి వచ్చేదో నాయనా.

ఏదో అభిమానపడి మా కోసం అంత దూరంనుంచి బ్రాహ్మడివి వచ్చేవు. నీ మేలు మరీ జన్మలో మరిచిపోలేం 'నాయనా' అంటూ పార్వతీ పరమేశ్వరులు కృతజ్ఞతతో క్రుంగిపోయేరు.

వీధిమలుపు దాటుతూ శాస్త్రులు దగ్గిన దగ్గు వర్షంలోంచి పోతూ రైలు వేసిన కూతలా వినిపించింది వాళ్ళకి.

పెరటి వరండాలో కాకి ముసురు తగ్గడం చూసి ఓసారలా చక్రి కొట్టడానికి ఎగిరిపోయింది.

*   *   *

మూడు రోజులు గడిచేయి.

ఆకాశంలో మబ్బులు చేస్తున్న అల్లరి ఇంకా తగ్గలేదు.

ఉండీ ఉడిగీ తెరలు తెరలుగా జల్లులు కురుస్తూనే ఉన్నాయి.

ఆ రోజు మధ్యాహ్నం ఒంటిగంటన్నర కావొస్తూంది. శర్మ మేస్టరు రెయిను కోటు వేసుకుని, చెప్పుల్లో కాళ్ళు దూర్చి, గొడుగుతో సహా గుమ్మం దాటి వీధి లోనికి అడుగు పెట్టేడు.

ఎదురుగా శాస్త్రులు కనిపించేడు. విపరీతమైన ఎగ ఊపిరితో, ఊపిరి సలుపుకోలేని దగ్గుతో రొప్పుకుంటూ నిలబడ్డాడు.

"చచ్చేం. గుమ్మం దిగేసరికి ఒంటి బ్రాహ్మడి శకునంరా బాబూ" అనుకుని "ఏం శాస్త్రులూ ఇలా వచ్చేవు?" అని అడిగేడు శర్మ మేస్టరు.

అంతా చెప్పి, మూర్తీభవించిన దైన్యంలా నిలబడ్డాడు శాస్త్రులు.

మూడు రోజుల క్రిందట అతను శర్మ మేస్టరింట్లో తద్దినం భోజనంచేసి వెళ్ళిన రాత్రి ఆయాసం ముంచుకొచ్చి మరిక తను బతకననుకున్నాట్ట! నిన్న పార్వతీపురం ధర్మాస్పత్రికి వెళ్తే, తనిఖీ చేసిన డాక్టరు ఉబ్బసం చాలా తీవ్ర దశలో ఉన్నదని, బాగా ట్రీట్ మెంటు తీసుకోవాలని, లేకపోతే లాభం లేదని చెప్పి, ఏవో మందులూ, ఇంజక్షన్లూ రాసేట్ట! "అయ్యా నేను బీదవాణ్ణి! కేవలం పౌరోహిత్యమ్మీదే కుటుంబమంతా బతుకుతున్నాం. అంతలేసి ఖరీదుపెట్టి మందులు కొనుక్కోలేన్నాయినా" అని బ్రతిమాలితే "అది సరేనయ్యా! దానికి నేనేవీఁ చెయ్యలేను. సరి ఆ మందులు కొనేదాకా ఈ మాత్రలు వాడు" అని నాలుగు బిళ్ళలిచ్చి, "వారం తిరిగేక,ఆ మందులు కొనుక్కుని వాడుతూ, మళ్ళీ రా" అని పంపించేట్ట డాక్టరు!

"మా ఊర్లో తలొక్కరూ ఎవరికి తోచినంత వాళ్ళిస్తున్నారు బాబూ. మీ ఊర్లో షావుకార్ని, మిమ్మల్నీ అడుగుదామని వచ్చేను. మీ రిప్పుడు దయదలచి ధర్మం చేస్తే నా పిల్లలకి నన్ను దక్కించిన పుణ్యం తవఁదే. మీ పేరు నా కుటుంబం బతికున్నంతకాలం చెప్పుకుంటాం బాబూ..." అంటూ ఇంకా ఏదో చెబుతూ రెండుచేతులూ ఎత్తి నమస్కరించి, అప్రయత్నంగా వచ్చిన కన్నీటిని ఆణచుకోలేకపోతున్నాడు శాస్త్రులు.

శర్మ మేస్టరికి ఎవరేనా డబ్బుల విషయం కదిపితే చాలు ఎక్కడలేని దరిద్రమూ దాపురిస్తుంది.

"చూడు శాస్త్రులూ, నిజవేఁ. నీ పరిస్థితి చూస్తే నాకూ చాలా బాధగానే

ఉంది. కాని నా దగ్గిర ప్రస్తుతం ఎర్రని ఏగాణీ లేదు. మొన్న అందిన సొమ్మంతా దమ్ములకీ, ఉడుపులికీ అయిపోయింది. నా కొడుకులు ముగ్గురూ కూడ బలుక్కున్నట్లు ఈ నెల ఏ ఒక్కడూ పైసా కూడా పంపలేదు. రాసిన ఉత్తరాలకి జవాబుల్లేవు. ఊరు కాని ఊర్లో నానా యాతనలూ పడుతున్నాను. చెప్పుకుందే వినేవాళ్ళు లేరు. అదిగో మళ్ళీ మబ్బులు కమ్ముకొస్తున్నాయి. ఆ షావుకారిని కలుసుకుంటానన్నావుగా, వేగిరం వెళ్ళు. పదో పరకో ఇస్తాడు. నేనలా కళ్ళంవేపు వెళ్ళాలి. అమ్మడూ తలుపేసుకో" అని మరి వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళిపోయేడు శర్మమేస్టరు.

అంతకు అరగంట మునుపే షావుకారిని కలుసుకుని "లేదు పొమ్మ"నిపించుకుని చివరి ప్రయత్నంగా కొండంత ఆశతో శర్మమేస్టరిని చూడవచ్చిన శాస్త్రులుకి నోట మాట రాలేదు.

ఆకాశం నిండా మేఘాలు కమ్ముకుని పిసినిగొట్టువాడి దయాగుణంలా ఉంది వెలుతురు.

ఆ రోజు ఉదయం అతి విధేయులైన ముగ్గురు కొడుకులూ పంపిన మూడు వందల రూపాయలూ, శర్మమేస్టరుగారి రెయిన్ కోటు కింద వెచ్చగా తగులుతూ పోస్టాఫీసు సేవింగ్స్ ఖాతా దగ్గరకి పాస్ బుక్ తో సహా దారితీసేయి.

సాయంత్రం పెరటి వరండాలో-

చలినుంచీ, వర్షంనుంచీ తప్పించుకుని కాస్త వెచ్చగా తలదాచుకోవచ్చునని, తినడానికి నూకల గింజలో, అన్నం పిడచలో దొరుకుతాయని ఆశతో వస్తున్న పితృదేవతని

"నీ జిమ్మ పడిపోనూ, మా కొంప మీద పట్టించే వేవిందే దిక్కుమాలిన ముండా" అని తిట్టుకుంటూ, బయటకు తరిమేస్తూ పెరటి వరండా జాఫిరీ తలుపులు మూసేసి చిడత వెయ్యడంతో గత మూడు రోజులుగా సతమతమౌతున్న "రిటైర్డ్ స్టేషన్ మాస్టారి అమ్మడి గారి"కి ఊర్లో వాళ్ళ వస్తువుల్ని తాకట్టు పెట్టుకుని చేబదుళ్ళివ్వడానికి తీరిక చిక్కటం లేదు.